# మిణుగురులు

''కొంచెం.... కూర !''

–సుభద్ర సోదికి అవరోధం వచ్చింది. అది కల్పించడానికేమో సుబ్బారావుకి కూర కావాల్సి వచ్చింది.

''అరెరె, అంతా వేసేశావ్ !''

''నాకు అక్కరలేదులెండి !''

సుబ్బారావ్ ఆమెవంక చూశాడు. సుభద్ర ఎంత మంచిది ! అంతకు ముందు తన ముక్కూ మొహమూ ఎరగకపోయినా – మూడుముళ్ల బంధంతో, భరోసాతో మూడు రోజుల పరిచయంతో కని పెంచిన వాళ్లని వదిలేసి...

ఆమె వంక చూస్తూ భోజనం పూర్తిచేసి బయటి గదిలోకి వచ్చేసరికి ఎప్పుడు తిందో ఏమో, సుభద్ర బయటకు వచ్చేసింది.

''పక్కింటి వాళ్లు ఫ్రిజ్ కొనుక్కున్నారట !''

తాంబూల చర్వణంతోపాటు సోదిశ్రవణం

''సంతోషం ! సర్వేజనాస్సుఖినోభవంతు''

''నేనేనా చెడుకోరేదాన్ని'' సుభద్ర మొహం ముడుచుకుంది. సుబ్బారావు పట్టించుకోలేదు.

పక్కవాటాలో ఆరుకుటుంబాలు మారాయి ఎదురింటిలో నాలుగు కుటుంబాలవారుంటున్నారు. కుడిపక్క వాటాలో ఇంటిగలవాళ్లుంటున్నారు.

చుట్టుపక్కల ఇళ్లలో విశేషాలు అనర్గళంగా ప్రసారం చెయ్యడం సుభద్రకి అలవాటు. భర్త కాఫీ తాగుతున్నప్పుడు భోజనం చేస్తున్నప్పుడు, నిద్రకు ఉపక్రమిస్తున్నప్పుడు... అదే ధ్యాస. '' ఎవరికయినా వస్తువూ, వాహనమూ జేరవేసుకునే గడుసుదనం ఉంటుంది... మనకదేంలేదే! ఇంత జీతమొస్తున్నా.... ముచ్చటగా ముగ్గురమే అయినా... బొటాబొటి, అత్తెసరు... వాళ్లకి'' –

''వాళ్లకి వస్తువులు కావాలి... మనకి... మనకి కావాల్సింది మనకి''

''అలా కాదండీ! ఎదురింటివాళ్లు చూడండి ముచ్చటగా ముందు పెద్దవాడిని నుంచోబెట్టుకుని, ఆవిడదాన్ని ఒడిలో కూచోపెట్టుకుని... స్కూటర్ అత్తవారు ఇచ్చినదేననుకోండి''

''అది ఎలా వచ్చిందో మనకు అనవసరం''

''పక్కింటావిడ చీరలు చూస్తే మతిపోతుంది. నెలకు కనీసం మూడయినా కొంటుంది. అంతటితో ఆగకుండా వీధిలో వాళ్లందరినీ పిలిచి చూపిస్తుంది''

'' ఆవిడ చీరలు కొనుక్కోడం నీకెందుకు కడుపునొప్పి. ఇది అన్యాయం కదూ !'' సుబ్బారావ్ అడిగాడు.

'' ఏది అన్యాయం ? ఆ చిన్నదాని కంటె ముందు కాపురానికి వచ్చినదాన్ని నేను. దానికంటె చదువుకున్నదాన్ని, అయన కంటె మీకు మరో డిగ్రీ ఎక్కువ ఉంది... నాలుగేళ్లు ముందే సర్వీసులో చేరారు... మనకి లేనిది''

''ష్! సుభద్రా, ఆవేశపడకు... నీకులేదన్న బాధ, వాళ్లకి ఉందని దుర్దా?'' సూటిగా అడిగాడు సుబ్బారావు.

'' ఎవరెంత చేసుకుంటేం అంతే'' సుభద్ర చిన్నబోయింది.

కూర తింటున్నప్పుడు ఆమె వంక ఎలా చూశాడో... అదే చూపు సంధించాడు.

''ఛస్! మీకెప్పుడూ ఒకటేసొద!'' సోఫా మీద నుంచి లేచి రివ్వున వంటగదిలోకి వెళ్లిపోయింది సుభద్ర.

'సొద' పాపం ఆడవాళ్ళకి అక్కరలేదా ? ముసిముసినవ్వులతో సుబ్బారావ్ ఆలోచనలో పడ్డాడు.

వెన్నెల వెలుగులా, మెరుపు జిలుగులా ఓ ఆలోచన వచ్చింది. లేచినుంచోబోయి వెంటనే కూచున్నాడు.

పదినిముషాలలో సుభద్ర లోపలికొచ్చింది.

''కూచునే ఉన్నారా ? నిద్రపోయారనుకున్నా''

సుబ్బారావ్ కళ్లలో ఏదో తృప్తి... ఆనందం... తనులేచి వెళ్లకపోతే సుభద్రే వస్తుందని తనకి తెలుసు.

'' ఎందుకో ఆ కులుకు ?''

'' ఏం కులుకుతూ ఉంటే నే బాగుండనా ?''

''మీకేం మహారాజాలా ఉంటారు... ఆ చుట్టపీక మనిషి ఎంత షోకు చేసుకుంటేనేం ? ఎన్నిసార్లు బట్టలు మార్చుకుంటేనేం.... తోట కూరకాడల్లా చేతులూ, పిచికబుర్రా...''

''అబ్బ ! ఆడవాళ్లనే కాదు... మగాళ్లనీ పరిశీలిస్తావన్నమాట !''

'' ఏం ? ఆడవాళ్లని పరిశీలించేశక్తి మీకే ఉందని కదూ మీ అహం !... మగవాళ్లని మేమూ పరిశీలించగలం. ఇక తోటి ఆడవాళ్లనంటారా ఒక్క తృటిలో ఫోటో తీసిపారేస్తాం... పక్క ఇంటి తాయారుందనుకోండి... చీర చూసి మీ కళ్లు జిగ్గుమంటాయి. ఇంత మందం కోటింగ్ వెనక... దాని సంగతి మీకెలా తెలుస్తుంది... చీర జిలుగు కాదు... లోపల పరికిణి చూస్తే...''

''సారీ! నాకు ఆ అవసరం లేదు''

'' ఓయబ్బ అవసరమట.... అవసరం.... పాపం! మగబుద్ధి అంత... నెలకి ఓ వంద రూపాయలు సెంట్లూ, అత్తర్లూ, పవుడర్లూ ... అసలు మనిషిలో ... ఇద్దరూ నడిచి వెళుతూ ఉంటే 'ఇదెక్కడి జంటరా' అనిపిస్తుంది ...''

''నీకా ?... పోనీ! ...అడొచ్చాను సుభద్రా మనమిద్దరం వెళుతూ ఉంటే ఎలా ఉంటుందంటావ్?''

'' అబ్బ ! మీకెప్పుడూ ఒకటే సొద !''

సుభద్ర నవ్వి లోపలకి వెళ్లిపోయింది.

''చూశారా. చూశారా, ఇలా మెతుకులు వేసుకున్నారో లేదో .... అలా బయలుదేరి పోయారు... ఇంతోటికనువిందైన జంటా... పిల్లల్ని లోపల పెట్టి తాళం వేసుకుని మరీ... వాళ్లు లేచి ఏడిస్తే ?''

'' నువ్ ఉన్నావ్‌గా పొరుగున ?''

''నేనేం దానికి అచ్చున్నానా ? అదేం నాకు అడబడుచా ?''

''పరోపకారాయపుణ్యాయ ...''

''చాల్లెండి !''

'' చాలదు ... వాళ్లు నిన్ను వెళ్లవద్దనలేదే ?''

'' మీరు ...''

'' అదీ సంగతి ... నేను పిలవలేదనా '' సుబ్బారావ్ ఆమెవంక మరో చూపు సంధించాడు.

అసలే మల్లెపూల వేళ ... సుభద్ర తట్టుకోలేకపోయింది.

'' బాబీగాడు చదువుకుంటానని వెళ్లిపోయాడు పదింటివరకూ రాడు ... నా పనులూ అయిపోయాయి ''

'' పద అయితే... వాళ్లేదోజుర్రేసుకుంటున్నారని ఎందుకా ఉడుకుమోతుతనం ... పద మనమూ వెళదాం !! ''

'' నాకేదో సిగ్గుగా ...''

'' పద చెబుతా !''

రెండంటే రెండు నిముషాలలో సుభద్ర బయలుదేరేసరికి సుబ్బారావ్ నిజంగా ఆశ్చర్యపోతాయాడు.

సుబ్బారావ్ ముందు నడుస్తుంటే సుభద్ర వెనక నడుస్తోంది.

''ఏం వదినగారూ ... ఇంత పొద్దు పోయి బయలుదేరారు... డాక్టరు దగ్గరకా ?'' సందు మలుపు దగ్గర పలకరింపు విని సుభద్ర బిక్కమొహం వేసింది.

'' ఛీ! ఏమిటండీ, అలా అడిగింది ? '' ముందు నడుస్తున్న భర్తనడిగింది కొంత దూరం వెళ్లాక.

'' పక్కింటావిడ షికారుకెళ్లిందని నేనూ బయలుదేరానని చెప్పాల్సింది... ఇలా ఎప్పుడూ లేనిది, చటుక్కున బయలుదేరితే ఏమొచ్చిందోననుకుంటే వాళ్ల తప్పుకాదు....''

''నాకు బాగాలేదు ఇదంతా! వెనక్కిపోదాం ...''

'' ఎలానూ బయలుదేరాం... నీకొక వింత చూపిస్తా పద... ''

సుబ్బారావ్ ఓ రెండడుగులు తగ్గి ఆమెతో నడక కొనసాగించాడు.

'' అసలు మనస్తత్వంలో ఆడదానికీ, మగాడికీ తేడా ఏమిటంటావ్?''

వెన్నెట్లో సుబ్బారావ్ అడిగాడు.

'' మగాళ్లు ఆలోచనలు ఆడవాళ్లగురించి, ఆడవాళ్ల ఆలోచనలు ఆడవాళ్ల గురించే!'' సుభద్ర ఠక్కున చెప్పేసింది.

'' నో, నో, మగాళ్ల ఆలోచనలు మగవాళ్ల గురించికాదన్న నీ అభిప్రాయంతప్పు.... మగాళ్ల ఎడల మగాళ్ల ఆలోచనలు ఆడవాళ్ల ఆలోచనల కంటే లోతుగా, పదునుగా, తీక్షణంగా వుంటాయి... నా ఆలోచనలూ అంతే !''

సుభద్ర ఘచ్చుమంది.

– '' ఆ బోర్డు చూడు !''

'' పారస్‌రాయ్ ... పాన్ బ్రోకర్ ... అక్కడికి తీసుకెళతారా ?''

'' ఛీఛీ ... ఇక్కడనుంచుని డ్రింకుతాగుదాం ...''

'' ఏమండీ.... మన ఎదురింటి వాళ్లు ...''

'' ఇదే ఫ్రిజ్‌లోని రహస్యం ... స్కూటర్ పోషణ వెనక మర్మం ... జిలుగు చీరలోని ఆంతర్యం...

ఇక్కడే ఆవిడ మొదటి భర్త చేయించిన వస్తువులు కుదువబెడతాడు... ఇద్దరూ కలసి...''

'' మొదటి భర్త ?''

'' ఆ పిల్లలు అతని పిల్లలు .., ఆమె భర్త చనిపోయాడు ... అతని భార్యా చనిపోయింది... ఇద్దరూ ...''

'' చాల్లెండి మీకెప్పుడూ ఒకటే సొద! పదండి ఇంటికి పోదాం! బాబీ ఇంటికి వస్తాడేమో!''

'' చూశావా, ఆవిడలానువ్ తిరగగలవా ?... సరే వెళదాం ... ఒక్కషరతు !''

'' మీ సోదేనా ?''

'' కాదు నీసోది, మానేస్తానని మాట ఇవ్వాలి''

'' మీ మాట ఎప్పుడయినా కాదన్నానా ?''

- ఇంటితాళం తీస్తున్నాడు సుబ్బారావు.

'' ఏమండీ ! ఎదురింటావిడ ... మీరంటారే ఎర్రముక్కుపుటాలావిడ ఏమందోవిన్నారా?''

'' ఏమందేవింటి? '' తక్కున ఎటెన్షన్‌లోకి వచ్చాడు సుబ్బారావు.

'' అబ్బ! ఆశ ! నా దగ్గర మాటపుచ్చుకున్నారే ... మీకు వినడం ఎంత సరదానో నాకు తెలుసు... కాని నేను చెప్పను''

ట్యూబ్‌లైట్ టిక్ టిక్‌లాడి వెలగడంతో సుబ్బారావు మొహం తెల్లబోయింది.

**స్వాతి సపరివార పత్రిక**

10.1.86